ఇండ్లలోకి చేరుతున్న ఎల్ - 6 కెనాల్ నీరు

ఇబ్బందులు పడుతున్న ప్రజలు..
పట్టించుకోని అధికారులు..

మంథని రూరల్, సెప్టెంబర్22: వ్యవసాయానికి సాగు నీరు అందించే ఎల్-6 కెనాల్ కాలువ నీరు ఇండ్లలోకి చేరుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సంఘటన మంథని మండలం కన్నాల, నాగారం గ్రామాల్లో చోటు చేసుకుంది. కాలువ ద్వారా ఆయా పొలాల్లోకి వెళ్లాల్సిన నీరు ఏకంగా ఇండ్లలోకి చేరుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనాలు లేక సమస్యతో సతమతం అవుతున్నారు. రామగిరి మండలం రాజాపూర్ నుంచి ప్రారంభమయ్యే ఎల్-6 కెనాల్ అక్కెపల్లి, పాత రచ్చపల్లి, కన్నాల, నాగారం, మల్లెపల్లి, మంథని వరకు ఉంది.

ఇంటికి ముందు చేరిన నీటిలో బాధితురాలు జంగిలి బుజ్జమ్మ

ఈ కెనాల్ ద్వారానే ఎన్నో ఏండ్లుగా రైతులకు అధికారులు సాగు నీరు అందిస్తున్నారు. అయితే గత కొద్ది రోజులుగా సంబంధిత అధికారులు కెనాల్‌ను పట్టించుకోకపోవడంతో నాగారం, కన్నాల గ్రామాల మధ్య ఉన్న కెనాల్ పూర్తిగా చెత్త చెదారంతో నిండిపోయింది. ప్రస్తుతం వ్యవసాయానికి సాగు నీరు అందిస్తున్న నేపథ్యంలో కాలువలో పూడిక తీయకపోవడంతో పక్కనే ఉన్న ఇండ్లలోకి ఈ నీరు వచ్చి చేరుతుంది. వరద నీటితో పాటు పాములు, ఇతర విష కీటకాలు ఇండ్లలోకి చేరుతున్నాయని ప్రజలు భయాందోళనకు గురౌతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి కాలువలను శుభ్రం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కాగా ఈ విషయం పై గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకుండా తమ సమస్యలను పెడచెవిన పెడుతున్నారని బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు చిదురాల మధూకర్ రెడ్డి తెలిపారు. అధికారుల నిర్లక్ష్యంతో ఆదివారం పెద్ద ఎత్తున వరద నీరు గ్రామానికి చెందిన జంగిలి బుజ్జమ్మ, రాధమ్మి ఇండ్లతో పాటు చుట్టుపక్కన ఉన్న ఇండ్లలోకి నీరు చేరిందని ఆయన వివరించారు.

కాల్వ పై నుంచి ఇండ్లలోకి వస్తున్న నీరు

విద్యార్థుల సంఖ్య పెంపుతో ఇబ్బందులు

- కరీంనగర్ మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల నుంచి భూపతిపూర్‌కు తరలింపు
- కరెంట్ లేక ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఆలస్యం

పాఠశాల ఆవరణలో విద్యార్థులు

సుల్తానాబాద్‌రూరల్, సెప్టెంబర్ 22: విద్యార్థుల సంఖ్య పెంపుతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కరెంట్ లేకపోవడంతో ఉదయం టిఫిన్-మధ్యాహ్నం భోజనం ఆలస్యఐందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూపతిపూర్ పరిధిలోని మహ్మాత్మా జ్యోతిబా పూలే పాఠశాలలో 550 మంది విద్యార్థులు ఉన్నారు. వారం క్రితం కరీంనగర్‌లోని మహ్మతా జ్యోతిబా పూలే పాఠశాల నుంచి దాదాపు 350 మంది విద్యార్థులకు తరలించారు. అయితే పెరిగిన విద్యార్థులకు సంఖ్యకు సరిపడా సౌకర్యాలు కల్పించలేదని ఆరోపిస్తున్నారు. ప్రతి రెండో ఆదివారం విజిటింగ్‌కు అవకాశం ఉంటుందని, అది కూడా సక్రమంగా లేదని మండిపడ్డారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ రాజేశంను వివరణ కోరగా కరీంనగర్‌లోని పాఠశాల భవనం మరమ్మతులు చేయిస్తుండడంతో, బీసీ వెల్ఫేర్ సెక్రటరీ ఆదేశాల మేరకు విద్యార్థులను భూపతిపూర్, గన్నేరువరం తరలించినట్లు తెలిపారు. అంతకు ముందే తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయంతో ఇబ్బందులు తలెత్తిట్లు తెలిపారు. ప్రతీ రెండో ఆదివారం విజిటింగ్ ఉంటుందని, ఎలాంటి సమస్యలు లేవన్నారు.

బందెల దొడ్డి నుంచి బయటకు

గోదావరిఖని జవహర్ నగర్‌లో రోడ్లపై ఆటంకం కలిగిస్తున్న ఆంబోతులు

- చేతులెత్తేసిన రామగుండం బల్దియా
- జనంపై విరుచుకుపడిన ఆంబోతులు

కోల్‌సిటీ, సెప్టెంబర్ 22: రామగుండం నగర పాలక సంస్థ ఉందా లేదా అన్నట్లుగా వ్యవహరిస్తున్నది. ఇప్పటికే ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందనే ఆరోపణలు ఎదుర్కొంటున్నది. ఇక నగరంలో మూగ జీవాల సమస్యను అరికట్టడంలోనూ చివరకు చేతులెత్తేసినట్లుగా ఉంది. ఇటీవల రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్న పశువులను బందెల దొడికి తరలించిన అధికారులు, నిర్వహణలో చేతులెత్తేయడంతో మళ్లీ రోడ్లపైకి వచ్చాయి. ఆదివారం రోడ్లపై ఆంబోతులు హల్‌చల్ చేశాయి. వాహన చోదకులు, స్థానికుల పైకి దూసుకురావడంతో జనం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఉరుకులు పరుగులు తీశారు. నగరంలో రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ పశువులు తిష్టవేసి ఉండడంతో వాటిని బందెల దొడ్డికి తరలించాలని కమిషనర్ ఆదేశించారు. ఈనెల 13న బల్దియా అధికారులు నగరంలోని పశువులను బందెల దొడ్డికి తరలించారు. ఈ తాత్కాలిక చర్యలతో చేతులు దులుపుకోవడంతో పశువులు మళ్లీ రోడ్లపైకి వచ్చాయి. ఆదివారం గోదావరిఖని జవహర్‌నగర్‌లో వీరంగం సృష్టించాయి. 15 రోజుల క్రితం తిలక్‌నగర్‌లో ఆంబోతుల దాడిలో దాదాపు వంద మంది వరకు గాయపడ్డారు. అసలు కార్పొరేషన్ అధికారులు ఉన్నారా..? ఉంటే ఏం చేస్తున్నారు..? అంటూ స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు.

సింగరేణి కార్మికులను నట్టేట ముంచిన కాంగ్రెస్

గోదావరిఖని, సెప్టెంబర్ 22: సింగరేణి కార్మికుల లాభాల వాటాలో కాంగ్రెస్ ప్రభుత్వం నమ్మించి నట్టేట ముంచారని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి కార్మికుల చెమట కష్టాన్ని దోచుకుందన్నారు. 2023-24కు గాను సింగరేణికి సంస్థకు రూ. 4,701 కోట్ల నికర లాభం వస్తే అందులో కేవలం రూ.796 కోట్లు కార్మికులకు ఇచ్చి, 33శాతం ఇచ్చామని అబద్ధాలు చెబుతోందని విమర్శించారు. 2022-23 వార్షిక సంవత్సరంలో 2,222 కోట్లు లాభాలు ఆర్జించగా, 2023-24లో రూ.4,701 కోట్లు నికర లాభం వచ్చినట్లు ప్రభుత్వం పేర్కొన్నదని, అందులో కార్మికులకు 33శాతం వాటాగా రూ.1,550 కోట్లు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కాని కేవలం రూ.796 కోట్లు మాత్రమే ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ప్రతి కార్మికుడికి లాభాల్లో వాటా కింద రూ.4లక్షలు రావాల్సిన ఉండగా, ప్రభుత్వం చేసిన మోసానికి ఒక్కొక్కరికి రూ. 2లక్షల లాభాలు తగ్గించారని ఆరోపించారు. 15 ఏళ్లలో ఈ సారే అత్యంత తక్కువ మొత్తంలో కేవలం 16.9శాతం లాభాలు కార్మికులకు అందాయని పేర్కొన్న చందర్ ప్రతి ఆర్థిక సంవత్సరానికి కార్మికులకు పంపిణీ చేసిన లాభాలను వివరించారు.

లాభాల వాటా ఘనత కాంగ్రెస్‌దే

గోదావరిఖని, సెప్టెంబర్ 22: సింగరేణి కార్మికులకు గతం కంటే ఎక్కువగా లాభాల్లో వాటా ఇప్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కిందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన కార్మికుల త్యాగాలు మరువలేనివన్నారు. కార్మికుల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా సింగరేణిని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. మూతపడిన మేడిపల్లి ఓసీపీలో జలవిద్యుత్‌కేంద్రం, రామగుండంలో 800మెగావాట్ల విద్యుత్ ప్లాంటు ఏర్పాటు కోసం పూనుకున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను విడుతల వారీగా అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

బండికి స్వాగతం పలికిన బీజేపీ శ్రేణులు

మంథని, సెప్టెంబర్ 22: స్థానిక పాత పెట్రోల్ పంపు చౌరస్తాలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఆదివారం స్వాగతం పలికారు. మహదేవపూర్‌కు వెళ్తున్న బండి సంజయ్‌ని బీజేపీ శ్రేణులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాలు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఆయన కాన్వాయిలో మహదేవపూర్‌కు తరలి వెళ్లారు.

బండికి స్వాగతం పలుకుతున్న నాయకులు

సమస్యలు పరిష్కరించాలి

జ్యోతినగర్, సెప్టెంబర్ 22: ఎన్టీపీసీ పట్టణ పరిధి రెండో డివిజన్ ఇందిరమ్మ కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు ముత్యంరావు డిమాండ్ చేశారు. ఇందిరమ్మకాలనీలో ఆదివారం నిర్వహించిన సీపీఎం నాలుగో మహాసభలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూల మాల వేసి నివాళుర్పించారు. అనంతరం పార్టీ 2వ డివిజన్ కార్యదర్శిగా గీట్ల లక్ష్మారెడ్డిని ఎన్నుకున్నారు. ఇక్కడ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం రామాచారి, నాయకులు ఎం కృష్ణారెడ్డి, టీ రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, పీ సునీత, అగ్గు అజయ్ ఉన్నారు.

కాంగ్రెస్ వ్యాఖ్యలు విడ్డూరం

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మంథని, సెప్టెంబర్ 22: డీసీసీ అధికార ప్రతినిధిగా ఉన్న ఇనుముల సతీశ్‌కు కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదంటూ ఆ పార్టీ నాయకులు పేర్కొనడం విడ్డూరంగా ఉందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తగరం శంకర్‌లాల్ అన్నారు. మంథని ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏ సంఘటన జరిగినా కాంగ్రెస్ నాయకులు అప్పటి జడ్పీ పుట్ట మధూకర్‌కు అంటగడుతూ తప్పుడు ఆరోపణలు చేశారన్నారు. ఇప్పుడు అక్రమ వసూళ్ల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇనుముల సతీశ్ విషయంలో మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ నాయకులు బాధ్యత వహించాల్సింది పోయి అతనితో పార్టీకి సంబంధం లేదనడం సిగ్గు చేటని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనే సీఆర్‌కే అపార్ట్‌మెంట్ విషయంలో ఇనుముల సతీశ్‌పై ఫిర్యాదు వచ్చిన సమయంలో అతడిని నియంత్రిస్తే ఎంతో మందికి ఇబ్బందులు తప్పేవన్నారు. ఇనుముల సతీశ్ మంత్రి శ్రీధర్‌బాబు పదవి, అండదండలను అడ్డుపెట్టుకునే అక్రమ వసూళ్లకు పాల్పడ్డారరి ఆరోపించారు. అతని అక్రమ వసూళ్లపై కేసులు నమోదవుతన్నా పోలీసులు ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పెగడ శ్రీనివాస్, బెల్లంకొండ ప్రకాశ్‌రెడ్డి, కాయితి సమ్మయ్య, పోగుల సదానందం, ఎరుకల రవి పాల్గొన్నారు.

రైతుల స్పందనతో ధర్నా విజయవంతం

- అడ్డుకునేందుకు కాంగ్రెస్ కుట్ర : బీఆర్ఎస్

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

పాలకుర్తి, సెప్టెంబర్ 22: రైతు రుణమాఫీ కోసం పాలకుర్తి మండలంలో బీఆర్ఎస్ నేత కౌశికహరి తలపెట్టిన రైతు ధర్నాను అధికార బలంతో భగ్నం చేయాలని కాంగ్రెస్ పార్టీ కుట్ర చేసిందని, కాని రైతులు స్పందించి విజయవంతం చేశారని బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి ముల్కలకొమురయ్య పేర్కొన్నారు. బసంత్‌నగర్‌లో ఆదివారం యాన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకుడు బయ్యపు మనోహర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ పెట్టిన భిక్షతో సింగిల్‌విండో చైర్మన్‌గా గెలిచిన విషయం మర్చిపోవద్దన్నారు. గ్రామాల్లో 100శాతం రుణమాఫీ చేసినట్లు నిరూపించకపోతే కాంగ్రెస్ నాయకులు ముక్కు నేలకు రాయాలన్నారు. 420 హామీలు ఇచ్చి, పూటకో మాటమార్చుతూ అబద్ధాలు ఆడుతూ రైతులను నట్టేట ముంచారాన్నారు. కౌశికహరిని విమర్శించేస్థాయి మనోహర్‌రెడ్డికి లేదన్నారు.బీఆర్ఎస్ నాయకులు మదన్ మోహన్‌రావు, మాదాసు సతీశ్, మాదాసు శ్రీనివాస్, బైరి రామకృష్ణ, హుస్సేన్, తిరుపతి, నాగరాజు, ముల్కలశ్రీధర్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకూ బోనస్ ఇప్పించాం

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

మాట్లాడుతున్న ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

గోదావరిఖని, సెప్టెంబర్ 22: సింగరేణికి వచ్చిన లాభాల్లో కాంట్రాక్టు కార్మికులకూ మొదటిసారిగా బోనస్ ఇప్పించేలా కృషిచేశామని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఆదివారం స్థానిక భాస్కర్‌రావు భవన్‌లో కాంట్రాక్టు కార్మికులతో సమావేశమై మాట్లాడారు. సింగరేణిలో అతి తక్కువ వేతనంతో కాంట్రాక్టు కార్మికులుగా, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్న వారు 25వేల మందికి పైగా ఉన్నారన్నారు. వారి కష్టం కూడా తోడైతేనే సింగరేణికి లాభాలు వచ్చాయన్నారు. సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వంపై ఏఐటీయూసీ ఒత్తిడి చేయడంతో ఒక్కో కార్మికుడికి రూ. 5వేలు ఇవ్వడానికి ఒప్పుకున్నట్లు పేర్కొన్నారు. కొన్ని సంఘాలు తెలిసీతెలియక దుష్ప్రచారం చేయడం, కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఇక్కడ ఏఐటీయూసీ నాయకులు కవ్వంపల్లి స్వామి, ఆరెల్లి పోశం, వెంకట్‌రెడ్డి, బుర్ర తిరుపతి, ఎంఏ గౌస్, ఏవీఎస్ ప్రకాశ్, ఇనుముల రాజమౌళి, పడాల కనకరాజు, చెప్యాల మహేందర్‌రావు, శివ, రాజనర్సు, తిరుపతి, ఊదరి రవి ఉన్నారు.

జూలపల్లిలో కొచ్చెరువు వద్ద కాల్చివేస్తున్న వ్యర్థాలు

ప్రయాణికులు ఉక్కిరి బిక్కిరి

జూలపల్లి, సెప్టెంబర్ 22 : మండలంలో దారి వెంట వ్యర్థాల కాల్చివేతతో ప్రయాణికులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. దుర్వాసనతో ఆయా మార్గాల గుండా ప్రయాణం చేయడం కష్టతరమవుతున్నది. జూలపల్లి, అబ్బా పూర్, కోనరావుపేట తదితర గ్రామాల్లో రహదారుల వెంట చెత్తాచెదారం ఒక చోట నిల్వ చేస్తుండడంతో దుర్వాసన వస్తున్నది. వ్యర్థాల కాల్చివేతతో ఆయా దారుల గుండా వెళ్తున్న పాదచారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డంప్ యార్డులకు తరలించకుండా ఊరికి దూరంగా మేకలు, గొర్రెలు, కోళ్ల వ్యర్థాలు, పనికిరాని ప్లాస్టిక్ వస్తువులు రోడ్ల వెంట విచ్చల విడిగా పడేస్తున్నారు. చెత్తకుప్పల వద్ద కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రయాణికుల వెంట పడుతున్నాయి. కుక్కల దాడుల నుంచి తప్పించుకోడానికి వాహనదారులు భయంతో స్పీడ్ పెంచి ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. అధికారులు స్పందించి వ్యర్థాలను రోడ్డున పడేయకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి ఏర్పాట్లు

బసంత్ నగర్ పాఠశాల పూర్వ విద్యార్థులు

పాలకుర్తి, సెప్టెంబర్22: బసంత్‌నగర్ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో 1984 నుంచి 1994 వరకు పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి ఏర్పాట్లు మొదలు పెట్టారు. ఆదివారం 10 బ్యాచ్‌లకు సంబంధించిన పలువురు పూర్వ విద్యార్థులు పాఠశాలకు చేరుకున్నారు. కార్యక్రమ నిర్వహణ కమిటీలను ఎన్నుకున్నారు. ప్రోగ్రాం కన్వీనర్‌గా దేవి లక్ష్మినర్సయ్య, కోశాధికారులుగా తాటిపాముల రమేశ్, ఏ రాజేశం, ఆర్ శ్రీనివాస్, కే శంకర్, ఇన్‌చార్జీలుగా తోడేటి రవికుమార్, ఫసియొద్దీన్, మల్కాప్రభాకర్, ఎం శంకర్, ఆడెపు నగేశ్, కే శ్యాంసుందర్, అంజనేయులు, తాజొద్దీన్, ఓ లక్ష్మీనర్సయ్య, మంజులత, శ్రీనివాస్ వ్యవహరించనున్నారు. అక్టోబర్ 20న పది బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులతో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

అఖిల పక్ష సదస్సుకు మనోజ్ గౌడ్

సుల్తానాబాద్‌రూరల్, సెప్టెంబర్ 22: బీసీ కులగణనపై హైదరాబాద్‌లో ఆదివారం అఖిలపక్ష కుల సంఘాలతో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కాట్నపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి మనోజ్ గౌడ్ హాజయ్యారు. బీసీ రిజర్వేషన్ 42 శాతం వరకు పెంచాలని, జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగ్యాల్లో అవకాశాలు కల్పించాలని సదస్సులో నాయకులు డిమాండ్ చేశారు.

రౌడీ షీటర్ల ఇళ్లల్లో తనిఖీలు

ఫర్టిలైజర్‌సిటీ, సెప్టెంబర్ 22: గోదావరిఖని వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ల ఇళ్లల్లో ఆదివారం ఉదయం పోలీసులు తనిఖీలు చేపట్టారు. నాలుగు పార్టీలుగా విడిపోయి ఉదయం 6 నుంచి 8గంటల దాకా ఇండ్లల్లో సోదాలు చేశారు. మారణాయుధాలు, పేలుడు పదార్థాలు, గంజాయి, డ్రగ్స్, ఇతర చట్ట వ్యతిరేక సామగ్రిపై దృష్టితో తనిఖీ చేశారు. ప్రస్తుతం రౌడీషీటర్ల నడవడిక, ప్రవర్తన, వారు చేస్తున్న పనులు గురించి విచారణ జరిపారు. రౌటీషీటర్లపై నిరంతరం నిఘా ఉంటుందని, ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొన్న కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇక్కడ వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, రవీందర్, ఎస్ఐలు రమేశ్, భూమేశ్, 30మంది సిబ్బంది పాల్గొన్నారు.

వివరాలు తెలుసుకుంటున్న వన్‌టౌన్ పోలీసులు

దరఖాస్తుల ఆహ్వానం

గోదావరిఖని, సెప్టెంబర్ 22: రామగుండం నియోజకవర్గంలోని పదో తరగతి, ఇంటర్‌లో అత్యధిక అధిక మార్కులు సాధించిన విశ్వబ్రాహ్మణ విద్యార్థులు నగదు పురస్కారాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు నాగుల మల్యాల రాజమౌళిచారి, పానుగంటి స్వామి పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఉత్తీర్ణత మార్కుల మెమోతో పాటు, కులం, నివాసం ధ్రువీకరణ పత్రం, సెల్ నంబర్, చిరునామాతో కూడిన వివరాలను ఈ నెల 30లోగా పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో అందజేయాలని సూచించారు.

ఎస్‌జీటీయూ కార్యవర్గం

జలపతి

ధర్మారం,సెప్టెంబర్22: ధర్మారంలో సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ (ఎస్‌జీటీయూ) మండల కమిటీని రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీనివాస్ రెడ్డి ఆదివారం ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా బీ జలపతి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా జే శ్రీదేవి, ప్రధాన కార్యదర్శులుగా కే మల్లయ్య, ఎం సుజాత, గౌరవాధ్యక్షుడిగా జీ వెంకటరమణా రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా కృష్ణహరి, ఆర్థిక కార్యదర్శిగా బీ ప్రకాశ్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా సురేష్, శ్రీలత, రామకృష్ణ, కిరణ్ కౌర్, వంశీమోహనాచార్యులు, నరేశ్, రఫీ, సహాయ కార్యదర్శులుగా ఎన్ రేవతి, భాగ్యలక్ష్మి, శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, అరుణదేవి, సంపత్, వనజ, జానకి ఎన్నికయ్యారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

జ్యోతినగర్, సెప్టెంబర్ 22: ఎన్టీపీసీ టీటీఎస్‌లోని సచ్‌దేవ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ యాజమాన్యం పాఠశాలలో ఆదివారం ఆన్ ది స్పాట్ చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఎన్టీపీసీ ఏజీఎం హెచ్‌ఆర్ బిజోయ్‌కుమార్ సిక్దర్ పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి రామగుండం మండలం నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 1,120 విద్యార్థులు హాజరయ్యారు. విజేతలకు అతిథులుబహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఇక్కడ ఎన్టీపీసీ డీజీఎం హెచ్‌ఆర్ కే ప్రవీణ్ చౌదరి, అధికారి ఏకే పాండే, ప్రిన్సిపాల్ జ్ఞానచంద్, హెచ్ఎం ఆరం జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఉన్నారు.

ఏఐఎఫ్‌బీలో చేరిక

పెద్దపల్లి టౌన్, సెప్టెంబర్ 22: పెద్దపల్లికి చెందిన మాదిగ శక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరి సురేందర్ ఆదివారం ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ పార్టీలో చేరారు. కరీంనగర్‌లో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ సురేందర్‌రెడ్డి నివాసంలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తనను పార్టీలోకి ఆహ్వానించిన సురేందర్‌రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్‌లకు సురేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

బొలెరో, ప్రైవేట్ అంబులెన్స్ ఢీ: డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

పెద్దపల్లి టౌన్, సెప్టెంబర్22: జిల్లా కేంద్రంలోని ఐటీఐ ఎదురుగా ఆదివారం బొలెరో, ప్రైవేట్ అంబులెన్స్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో శాంతినగర్ చెందిన టోనీకి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డ్రైవర్ టోనీ అంబులెన్స్‌ను తీసుకొని శాంతినగర్ నుంచి పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానకు వెళ్తుండగా, కరీంనగర్ నుంచి గోదావరిఖని వైపు అతి వేగంగా వస్తున్న బొలెరో వాహనం ఒక్కసారిగా ఢీకొంది. బాధితుడిని పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ట్రాక్టర్ అసోసియేషన్ ఎన్నిక

ట్రాక్టర్ అసోసియేషన్ నాయకులు

ముత్తారం, సెప్టెంబర్ 22: అడవిశ్రీరాంపూర్‌లో శ్రీరామాంజనేయ ట్రాక్టర్ అసోషియన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఈసంపల్లి సంతోష్, ఉపాధ్యక్షుడిగా గట్టు సమ్మయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శిగా మారం నారాయణ, సహాయ కార్యదర్శి బోనగిరి వినోద్, కోశాధికారిగా జంగ సమ్మయ్యను ఎన్నుకున్నారు. ఇక్కడ ట్రాక్టర్ యజమానులు పాల్గొన్నారు.

అబ్బిడిపల్లిలో వైద్య శిబిరం

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

ఓదెల, సెప్టెంబర్ 22: సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అబ్బిడిపల్లి గ్రామంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ గ్రామంలో ఎవరు చనిపోయిన నేత్రదానం చేసేలా గతంలో పంచాయతీ తీర్మానం చేసింది. ఇక్కడి ప్రజల బాగు కోసం ఎల్‌వీ ప్రసాద్ కంటి దవాఖాన సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు. 50మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నాయకులు భీష్మాచారి, మాజీ సర్పంచ్ ఒజ్జె కోమలత-శ్రీనివాస్, డాక్టర్లు కృష్ణ, సుబ్బారావు, లోకేష్, ఫౌండేషన్ ప్రతినిధులు వేణు, మల్లేశం, ఇప్పనపల్లి వెంకటేశ్వర్లు, సాయికృష్ణ, మహేందర్, ఇంద్రారెడ్డి, చందు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331774-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189